క్లుప్తంగా

వైభవంగా కోదండరాముడి వార్షిక కల్యాణం



బోడికొండ కోదండ రాముడి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో నీలాచల పర్వతం (బోడికొండ)పై కొలువుదీరిన కోదండ రామస్వామి వారి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చైత్ర బహుళ దశమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వేకువజామునే స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫలరసాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి సన్నిధిలో వర్ష వర్ధన హోమం నిర్వహించి... సాయంత్రం సుమారు ఆరు గంటల ప్రాంతంలో సీతారామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, పవన్, రామతీర్థం సేవా సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వైద్యులు

పూసపాటిరేగ: బీసీజీ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెల్లివలస పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ, వయోజనులకు పీహెచ్‌సీల ద్వారా ఇచ్చే బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షయవ్యాధి రోగులు వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. 18 నుంచి 60 సంవత్సరాల్లోపున్న ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఆయనతో పాటు పూసపాటిరేగ, గోవిందపురం వైద్యాధికారులు ప్రమీలాదేవి, కడగల త్రినాథ్, తదితరులున్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన



కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి సూర్యకళను ఆరా తీశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, ఇతర అంశాల పై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గం పరిధిలో 2,400 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని, వీరంతా ఈనెల 5,6,7 తేదీల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అలాగే హోం ఓటింగ్‌కు దివ్యాంగులు, వృద్ధులు 34 మందిని గుర్తించామని, వీరు ఈనెల 8,9,10 తేదీల్లో ఓటుహక్కును ఇంటి వద్ద వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు నీడకోసం టెంట్లు, తాగునీటి, వైద్య సదుపాయం, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రమేష్ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

చీపురుపల్లి: ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ మే 13న జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసి సద్వినియోగం చేసుకోవాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ కోరారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యువతకు శుక్రవారం అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల/జూనియర్ కళాశాలలో షటిల్ బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం ఉమా మహేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. చీఫ్ కోచ్ పి.శ్రీరాములు మాట్లాడుతూ శిబిరంలో 7 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు గల బాల,బాలికలకు షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తామన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు శిక్షణ ఉంటుందని, క్రీడాకారులకు పాలు, గుడ్లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఇవేం కష్టాలు బాబు..



జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బయట నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు



ఎస్‌బీఐ లోపలకు వెళ్లేందుకు వృద్ధుల పాట్లు

ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటివద్దే పింఛన్ సొమ్ము అందుకునే వృద్ధులు, వితంతువులకు కొత్త కష్టం వచ్చింది. చంద్రబాబు పుణ్యమా అని మండుటెండల్లో బ్యాంకులకు పరుగులెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్లు ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీ వేకువజామునే ఇంటికొచ్చి మరీ పింఛన్లు అందించేవారు. వాళ్లు వైఎస్సార్‌సీపీకి ప్రచారం చేస్తారంటూ కక్ష కట్టిన చంద్రబాబు అండ్ కో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్ల సేవలను నిలిపివేయించారు. దీంతో ఈ నెల పింఛన్ సొమ్మును ప్రభుత్వం బ్యాంక్ ఖాతాలకు జమ చేయడంతో నగదు తీసుకునేందుకు లబ్ధిదారులు ఎండల్లో అవస్థలు పడుతూ బ్యాంకులకు పరుగులెడుతున్నారు. వడదెబ్బ కారణంగా కొంతమంది వృద్ధులు మృత్యువాత పడ్డారు. హాయిగా ఇంటివద్దే నగదు అందుకునే మాలాంటి పండుటాకులపై నీకెందుకింత కక్ష అని చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్

చంద్రబాబు వల్లే ఈ కష్టాలు..



ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం ఆరు గంటలకే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవాడు. చంద్రబాబు పుణ్యమా అని ప్రస్తుతం పింఛన్ కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నాకు 70 సంవత్సరాలు దాటాయి.. ఎండలు చాలా దారుణంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులు బ్యాంక్ ఖాతాకు జమచేయడంతో ఎండలోనే పరుగులు తీయాల్సి వస్తోంది. పేదలతో రాజకీయం చేయడం తగదు. మళ్లీ జగన్ వస్తేనే మాకు సక్రమంగా ఒకటో తేదీకే పింఛన్ డబ్బులు అందుతాయి.

– దయంత్రి పార్వతి, పాత కుమ్మరివీధి, చీపురుపల్లి

ఇబ్బంది పెట్టడం సరికాదు



ఇంటి దగ్గరే పింఛన్లు తీసుకునే మాలాంటి వారిని రాజకీయకక్షతో ఇబ్బంది పెట్టడం సరికాదు. బ్యాంక్ ఖాతాకు నగదు జమ చేయడంతో తీసుకునేందుకు అవస్థలు పడుతున్నాం. పింఛన్ సొమ్ముకోసం పూసపాటిరేగ స్టేట్‌బ్యాంక్ వద్ద గంటల తరబడి ఎండలోనే వేచి ఉన్నాం. చంద్రబాబునాయుడు ఇంత నీచంగా వ్యవహరించడం తప్పు.

– లోతేటి సావిత్రి, వృద్ధురాలు, గుంపాం, పూసపాటిరేగ మండలం

వలంటీర్ సేవలు కావాలి..



గతంలో ఒకటో తేదీన వలంటీర్లు పింఛన్ సొమ్ము ఇంటికి వచ్చి మరీ ఇచ్చేవారు. వలంటీర్లను రాజకీయ కోణంలో తొలగించడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. బ్యాంక్ వద్ద పింఛన్ డబ్బుల కోసం ఎండలోనే నిరీక్షించాల్సి వచ్చింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే మా కష్టాలు తీరి, ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్ అందుతుంది.

– పారిపల్లి ఆదినారాయణ, వృద్ధుడు, పూసపాటిపాలెం, పూసపాటిరేగ మండలం

పింఛన్లు అడ్డుకోవడం సరికాదు..



కోడి కూయకముందే వలంటీర్లు అందిస్తున్న పింఛన్లను అడ్డుకోవడం సరికాదు. నేను మంచానికి పరిమితమయ్యాను. నా కుమారుడి సహాయంతో బ్యాంక్‌కు వెళ్లాల్సివచ్చింది. అవ్వాతాతలకు ఇబ్బంది పెడితే చంద్రబాబుకు ఏం వస్తుందో అర్థం కావడం లేదు.

– కండిపల్లి సన్యాసినాయుడు, పింఛన్‌దారుడు, వల్లంపూడి, వేపాడ మండలం

కోలగట్లతోనే నగర అభివృద్ధి..



12వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- ఐదేళ్లలో మారిన నగర రూపురేఖలే నిదర్శనం
- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరం అభివృద్ధి కోలగట్ల వీరభద్రస్వామితోనే సాధ్యమైందని... నగరం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి ఆయన్ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 12వ డివిజన్ పరిధి బుంగవీధి, బూడువీధి, తదితర ప్రాంతాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణి స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కోలగట్ల హయాంలో చేసిన అభివృద్ధి, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని వివరించారు. ఏ ప్రాంతానికి వెళ్లినా వీరభద్రస్వామికి ప్రజా మద్దతు అనూహ్యంగా లభిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగింది కాబట్టే మద్దతు పలుకుతున్నారని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ రేగాన రూపాదేవి మాట్లాడుతూ.. కోలగట్లను మరలా గెలిపించినట్లయితే నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు స్థానిక నాయకులు బొంగ భానుమూర్తి, వెత్సా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజలు శ్రావణికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు మెంబర్ డొంకాడ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: రీమాపేటలో ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

రీమాపేటలో ..

విజయనగరం రూరల్: మండలంలోని రీమాపేటలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని వివరించారు. రానున్న రోజుల్లో సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

మేలు చేసిన నాయకుడికి మద్దతివ్వండి

ఐదేళ్ల కాలంలో ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా, కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామికి నియోజకవర్గ ప్రజలు అండగా నిలబడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీ క్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో ధనలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పతివాడ అప్పలనాయుడు, తదితరులు

- వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ

పూసపాటిరేగ: జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు హితవు పలికారు. శుక్రవారం స్థానిక మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పతివాడ పంచాయతీలో రజక కుటుంబీకులను మభ్యపెట్టి జనసేన కండువాలు కప్పారని ఆరోపించారు. రాజకీయాలు హుందాగా చేయాలే తప్ప నైతిక విలువలు పాటించకుండా రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. తన సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసిన ఉద్యోగులకు శ్రమకు తగిన వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిన పరిస్థితులు అందరికీ తెలుసునని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కారుచౌకగా కొట్టేసి, ఇప్పుడు ప్రజాసేవ చేస్తానంటూ గ్రామాల్లో పర్యటిస్తే లోకం నాగమాధవిని ఎవ్వరూ నమ్మరన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్. సత్యనారాయణరాజు, మహంతి జనార్దనరావు, మహంతి లక్ష్మణరావు, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు అధికారమే పరమావధి..

- కూటమి తప్పుడు హామీలను నమ్మవద్దు
- వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం
- నగరంలోని 38వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టిన కోలగట్ల



38వ డివిజన్ ఉడాకాలనీలో కోలగట్లకు విజయ తిలకం దిద్దుతున్న మహిళ

విజయనగరం: అధికారమే పరమావధిగా ప్రతిపక్ష నేత చంద్రబాబు అండ్‌కో మరోసారి మాయమాటలు చెబుతూ ప్రజల ముందుకు ఓట్లు దండుకునేందుకు వస్తున్నారని.. కూటమి పేరిట ఇచ్చిన హామీలు నమ్మి మోసపోతే పేద ప్రజలంతా సంక్షేమానికి దూరమయ్యే ప్రమాదం ఉందని వైఎస్సార్‌సీపీ విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 38వ డివిజన్ ఉడా కాలనీ శివాలయం నుంచి శుక్రవారం ప్రారంభమైన ఎన్నికల ప్రచారంలో మేయర్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్, కుమార్తె, అల్లుడు డాక్టర్ సంధ్య, డాక్టర్ నాగాభిషేక్‌తో కలిసి పాల్గొన్నారు. స్థానికులు అధిక సంఖ్యలో హాజరై కోలగట్ల, తదితరులకు పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో కోలగట్ల వీరభద్రస్వామి గడిచిన ఐదేళ్లలో చేసి చూపించారన్నారు. అన్ని డివిజన్‌లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచారని తెలిపారు. ముఖ్యమంత్రి జగనన్న అవినీతి, లంచగొండితనం లేని పాలన అందించారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పథకాల వల్ల అప్పులు పెరిగాయని విమర్శించిన ప్రతిపక్షాలే నేడు అవే పథకాలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ మేనిఫెస్టో పట్ల ప్రజలు ఆకర్షితులు కావడం లేదని చెప్పారు. తెలుగుదేశం ప్రకటించిన మేనిఫెస్టోలో బీజేపీ అగ్రనేతల ఫొటోలు లేకపోవడాన్ని తప్పుపట్టారు. రాబోయే రోజుల్లో ప్రకటించిన పథకాలను అందించలేకపోతే బీజేపీ నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న ఉద్దేశంతో వారి ఫొటోలను మేనిఫెస్టోలో ముద్రించలేదని ఆరోపించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మేనిఫెస్టోను చెప్పిన విధంగా అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బొబ్బాది త్రినాథరావు, బొబ్బాది విజయలక్ష్మి, నారాయణప్పడు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: రీమాపేటలో డిప్యూటీ స్పీకర్ కోలగట్లను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 58 నెలల కాలంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటేయ్యాలని వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలను కోరారు. విజయనగరం మండల పరిధిలోని రీమాపేట, దుప్పాడ, చిల్లపేట, కోరుకొండ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీమాపేటలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు ఘన స్వాగతం పలికి, భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరుపున పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌కు, అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సాగిందన్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందించారని కొనియాడారు. అర్హులందరికీ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. చెప్పిన ప్రతి హామీని అమలు చేశాం కాబట్టే ఓట్లు వేయమని ధైర్యంగా అడుగుతున్నామని చెప్పారు. టీడీపీ నాయకులు పగటి వేషగాళ్ల మాదిరి పర్యటనలు చేసి నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై బురద జల్లే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబునాయుడు ప్రకటించిన మాయల మేనిఫెస్టోను ఎవ్వరూ నమ్మవద్దని సూచించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రి పదవులు అనుభవించిన అశోక్ గజపతిరాజు నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారని ఆరోపించారు. 20 ఏళ్లలో అభివృద్ధి చేయని రాజు కావాలో.. రెండేళ్లలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది, ప్రజలకు మౌలిక వసతులు కల్పించిన కోలగట్ల కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మీరే రక్ష



డెంకాడ: బంటుపల్లి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బద్దుకొండ మణిదీప్, ఎంపీపీ వాసుదేవరావు,వైస్‌ఎంపీపీలు తమ్మునాయుడు.అనిత తదితరులు

- జోన్ –2 ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బద్దుకొండ మణిదీప్



నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలే రక్ష అని జోన్–2 ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బద్దుకొండ మణిదీప్ అన్నారు. మండలంలోని బంటుపల్లి, గొడిపాలెం, ఒమ్మిపేట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్దుకొండ మణిదీప్, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, తదితరులు మాట్లాడుతూ.. ప్రజలు ఆర్థికంగా బాగుండాలని ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందించారన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా బడ్డుకొండ అప్పలనాయుడు, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్‌లకు ఫ్యాన్ గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కూరాకుల అనిత, సొసైటీ డైరెక్టర్ చిక్కాల జనార్దనరావు, వెదుళ్లవలస, పినతాడివాడ సర్పంచ్‌లు కలిశెట్టి రామకృష్ణ, లెంక లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ కృష్ణవేణి, మీసాల లక్ష్మణ, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

కొండవెలగాడలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దంతులూరి గిరిబాబు శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రజలకు మళ్లీ సంక్షేమ పథకాలు ఎప్పటిలాగే అందాలన్నా, గ్రామం మరింత అభివృద్ధి చెందాలన్నా ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో మొయిద అక్కోజీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులను తెలియజేయండి

- ఎంపీపీ కల్యాణి



మాట్లాడుతున్న ఎంపీపీ మహంతి కల్యాణి, తదితరులు

పూసపాటిరేగ: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలుంటే తెలియజేయాలని ఎంపీపీ మహంతి కల్యాణి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు దారపు అప్పలనరసమ్మ, మైలపల్లి తాతలు మాట్లాడుతూ.. కోనాడ, చింతపల్లి గ్రామాలలో జల్‌జీవన్ మిషన్ కుళాయిల ఏర్పాటు పనులు పూర్తయ్యాయని, వెంటనే తాగునీరు సరఫరా చేయాలని కోరారు. కొండగుడ్డి ఏతపేట సమీపంలో కుళాయిల నుంచి నీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పతివాడ ఎంపీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనాయుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎంపీడీఓ ఎం. రాధిక, ఎంపీపీ కల్యాణి స్పందిస్తూ.. తాగునీటి సమస్యలను సభ్యులు తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఎండల నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్. సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ పద్మనాభం ఫీడర్, 33/11 కేవీ సీఎంఆర్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ముడిదాం, సుంకరిపేట, చెల్లూరు, కోరాడపేట, గుండాలపేట, గొల్లలపేట, వీటీ అగ్రహారం, బీసీ కాలనీ, సంతోష్‌నగర్, గణేష్‌నగర్, వై జంక్షన్ ప్రాంతాలలో సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం, కొండవెలగాడ 11 కేవీ ఫీడర్ పరిధి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈ పూడి హరి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో పారసాం, చంద్రంపేట, టెక్కలి, చిన బూరాడపేట, పెద్ద బూరాడపేట, తుమ్మలపేట, కొండవెలగాడ, గెద్దపేట, ఎల్ఎన్ పురం.. గుర్ల మండలంలోని భూపాలపురం, నడుపూరు గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com